క్లుప్తంగా

సీపీఎస్‌ను రద్దు చేయాలి



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఉద్యోగులు

సిద్దవటం : సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ పద్ధతిని ప్రభుత్వం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రమేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యోగుల సంఘం సిద్దవటం తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం ఒక్కరోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సిద్దవటం తాలూకా యూనిట్ అధ్యక్షుడు సి.మురళి, బద్వేల్ కార్యదర్శి పుష్పరాజు, కడప సిటీ అధ్యక్షుడు కృష్ణప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

రచ్చబండ వద్ద ఎంపీ, ఎమ్మెల్యేలు



రచ్చబండ వద్ద ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే గడికోట, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

సంబేపల్లె : గుట్టపల్లె పంచాయతీ అంకిరెడ్డిగారి పల్లెలో కీ.శే.అన్నారెడ్డి, రెడ్డెమ్మల జ్ఞాపకార్థం నూతనంగా నిర్మించి, ప్రారంభించిన రచ్చబండ ప్రాంగణాన్ని మంగళవారం ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీచైర్మన్ అమరనాథ్‌రెడ్డిలు పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ సమస్యలను రచ్చబండ వద్ద చర్చించి వాటిని పరిష్కరించుకోవాలన్నారు.

అన్నదానం



ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయచోటి అర్బన్ : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. పట్టణానికి చెందిన రాజేంద్రరాజు వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబీకులు క్లబ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పట్టణంలోని చిత్తూరు రోడ్డు, మదనపల్లె రోడ్డులలో తాత్కాలిక గుడిసెలలో నివసిస్తున్న నిరుపేదలకు క్లబ్‌సభ్యులు అహార పొట్లాలను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్, దాత కుటుంబీకులు కొండూరు చంద్రశేఖర్‌రాజు, శిల్పా, ప్రభావతమ్మ, త్రివిక్రమరాజు, మనోజ్‌కుమార్‌రాజు, క్లబ్‌ఉపాధ్యక్షుడు హరీష్ చంద్ర, సభ్యుడు భానుప్రకాష్ పాల్గొన్నారు.

అకాల వర్షానికి దెబ్బతిన్న అరటి పంట



సాధువారిపల్లిలో దెబ్బతిన్న అరటిపంట

పుల్లంపేట : మండల పరిధిలోని సాధువారిపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం కురిసిన అకాల వర్షం, ఈదురు గాలులకు 15 ఎకరాలలో అరటిపంట దెబ్బతిన్నట్టు రైతులు వాపోతున్నారు. ఆరుగాలం కష్టించి దిగుబడి వచ్చే సమయంలో ప్రకృతి కన్నెర్రజేయడంతో తాము తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

సంబేపల్లె : ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ మహేశ్వరి బాయ్ అన్నారు. మండల పరిధిలో దుద్యాల గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారని సోమవారం ఫిర్యాదులు అందాయన్నారు. ఈ విషయంపై పరిశీలించి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా అవసరాల నిమిత్తం ప్రభుత్వ భూములు వినియోగించుకోవాలే తప్ప ఇతర పనులకు వినియోగించుకోకూడదన్నారు. ఇప్పటికే మండల కేంద్రంతోపాటు గ్రామాలలోని ప్రభుత్వ భూమల వివరాలు కలెక్టర్ కార్యాలయానికి నివేదించామన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ

రాజంపేట రూరల్ : ఏరియా ఆసుపత్రిలో అడ్మిట్ అయిన వ్యాధిగ్రస్తులకు నేటి నుంచి ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నట్లు హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు పి.వెంకటరమణ తెలియజేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో మంగళవారం అడ్మిట్‌లో ఉన్న 30 మంది వ్యాధిగ్రస్తులకు హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు పంపిచేశారు.

వలంటీర్లు సైనికుల్లా పనిచేయాలి



రాయచోటి టౌన్: వలంటీర్లకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి అర్బన్: ఇస్త్రీ చేస్తున్న వ్యక్తికి పథకాలను వివరిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

- సీఎం జగన్ తీసుకొచ్చిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం
- వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటిటౌన్ : వలంటీర్లు మనకు గొప్ప సేవకులని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం సుధ కన్వెన్షన్ హాల్‌లో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. రాయచోటిలోని 25 వార్డు సచివాలయ పరిధిల్లోని వలంటీర్లు హాజరయ్యారు. వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులను ప్రదానం చేసి, ఘనంగా సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలుస్తాయన్నారు. వివక్ష, అవినీతి లేకుండా వలంటీర్ల వ్యవస్థ పని చేయాలని సూచించారు. మీ వార్డు పరిధిలో ఉన్న కుటుంబాల వారికి చేదోడు వాదోడుగా నిలిచి ప్రజల మన్నలు పొందాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హతే ప్రమాణికంగా అర్హులందరికీ అందేలా వలంటీర్లు సైనికుల్లా పని చేయాలన్నారు. ఇప్పటి వరకు అవార్డులు రాని వలంటీర్లు నిరుత్సాహపడరాదన్నారు. మహిళలను అన్ని రంగాలలో బలోపేతం చేసేందుకు జగన్ ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. రాయచోటిలో ప్రశాంత వాతావరణం కల్పించింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేనని శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. గూండాలు, రౌడీలు, మాఫియాలు, అల్లర్లు, సెటిల్‌మెంట్లు, అక్రమాలు లేకుండా చేశానని చెప్పారు. మంచితనం, సామరస్యం, విలువలతో కూడిన రాజకీయాలనే కొనసాగిస్తానన్నారు.

ప్రతిపక్షాలను తిప్పి కొట్టాలి..

జగన్ ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక బురదజల్లుతున్నాయన్నారు. దుష్టచతుష్టయం, ప్రతిపక్షాలు, పచ్చ మీడియా అసత్య కథనాలను వండివారుస్తోందని చెప్పారు. మూడేళ్ల పాలనలో జగన్ ప్రభుత్వం 98 శాతాకి పైగా ఇచ్చిన హామీలు అమలు చేశారని గుర్తు చేశారు. నాయకుడు బలవంతుడైతే శత్రువులు ఏకమవుతారు. రాష్ట్రంలో ప్రస్తుతం అదే కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు.

జై జగన్.. జయహో వలంటీర్

111 సంవత్సరాల తరువాత రాయచోటిని జిల్లా కేంద్రం చేయడంతోపాటు రెవెన్యూ డివిజన్‌ని కేటాయించారన్నారు. ఏడు సార్లు కుప్పంలో ఎమ్మెల్యేగా గెలిచిన చంద్రబాబు నాయుడు కనీసం రెవెన్యూ డివిజన్‌గా కూడా చేసుకోలేదని ఆరోపించారు. రాబోయే రోజుల్లో రాయచోటిని మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. చివరగా శ్రీకాంత్‌రెడ్డి జై జగన్....జయహో వలంటీర్‌లు అని నినదించడంతో ఆ ప్రాంగణం అంతా మార్మోగింది. కార్యక్రమంలో మదనపల్లె పరిశీలకులు హబీబ్‌ఖాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజూర్ రహిమాన్, బేపారి మహమ్మద్‌ఖాన్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్, ఆసీఫ్ అలీఖాన్, ఫయాజ్ అహమ్మద్, గువ్వల బుజ్జిబాబు, అన్నా సలీం, నవరంగ్ నిస్సార్ తదితరులు వలంటీర్లపై ప్రశంసలు కురిపించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రాయచోటి అర్బన్ : పేదప్రజల సంక్షేమమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం మాసాపేటలోని పలు వీధులలో తిరిగారు. గడప గడపకు వెళ్లి ప్రజా సమస్యలపై ఆరా తీస్తూ ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ ప్రజలతో మమేకమయ్యారు. ఆయన మాట్లాడుతూ మాసాపేట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని సారించామన్నారు. పేదప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. గడప గడపకు కార్యక్రమానికి వచ్చిన శ్రీకాంత్‌రెడ్డిని ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైస్‌చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, కమిషనర్ గంగాప్రసాద్, కౌన్సిలర్‌లు అమ్మాజీ, సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, వైఎస్ఆర్‌సీపీ నేతలు జీఎండీ ఇమ్రాన్, ఇర్షాద్, బేపారి మహమ్మద్‌ఖాన్, ఆసిఫ్‌అలీఖాన్, అల్తాఫ్, అయ్యవారురెడ్డి, విక్కీ దేవేంద్ర, అమీర్, జావీద్, కొలిమి చాన్‌బాషా, ఫయాజ్ అహమ్మద్, గౌస్‌ఖాన్, గువ్వల బుజ్జిబాబు, కొత్తిమీర ప్రసాద్, హజరత్ ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లను కించపరిచిన వ్యక్తి చంద్రబాబు

సుండుపల్లె (రాయచోటిటౌన్) : వలంటీర్ వ్యవస్థనే కించపరిచిన వ్యక్తి చంద్రబాబు నాయుడని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. మంగళవారం సుండుపల్లె మండలంలో పలు కార్యక్రమాలలో ఎంపీ మిథున్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలు పాల్గొన్నారు. ముందుగా వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొని వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థను కించపరిచే విధంగా చంద్రబాబు నాయుడు మాట్లాడారన్నారు. కానీ నేడు ఈ వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలకు మోసం చేశారని కానీ నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థ ద్వారా కులమతాలకు అతీతంగా అర్హత ఒక్కటే ప్రమాణికంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరవేస్తున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలలుగన్న గ్రామ సచివాలయ వ్యవస్థతోపాటు వలంటీర్ల వ్యవస్థ ద్వారా నేరుగా అర్హత ఒక్కటే ప్రమాణికంగా ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. అనంతరం జీకె రాచపల్లెలోని మడితాటమ్మ అమ్మవారికి ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయవరం సచివాలయంలో ఆర్‌ఓ ప్లాంట్‌కు వారు భూమి పూజ చేశారు. సర్పంచ్ షరీఫ్, వైఎస్‌సీపీ మండల కన్వీనర్ రామస్వామిరెడ్డి, రహిమాన్ ఖాన్, మంత్రి శివారెడ్డి, ఎంపీపీ రమణమ్మ, తహసీల్దార్ చాందినీ, ఎంపీడీఓ రామచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వలంటీర్లకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ తదితరులు

భూ హద్దులు చూపించి పేదలకు న్యాయం చేయండి

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు రెవెన్యూ పరిధిలో 2005లో పేద దళితులకు ఇచ్చిన జెడ్‌హెచ్‌డీసీ భూములకు హద్దులు చూపించాలని సీపీఐ మండల కార్యదర్శి సి.నాగమ్మ పేర్కొన్నారు. మంగళవారం చిన్నఓరంపాడు గ్రామంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2005లో దళిత కుటుంబాలకు ఒక్కొక్కరికి ఎకరా చొప్పున అప్పటి ప్రభుత్వం పట్టాలిచ్చిదన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు భూములకు హద్దులు చూపించలేదని, ఇదే అదునుగా చేసుకొని కొందరు ప్రైవేట్ వ్యక్తులు జెడ్‌హెచ్‌డీసీ భూములను కబ్జా చేస్తున్నారన్నారు. ఈ విషయంపై సబ్ కలెక్టర్ కార్యాలయంలో సీపీఐ ఆధ్వర్యంలో ముట్టడి నిర్వహించామని, ఇందుకు స్పందించిన జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ జెడ్‌హెచ్‌డీసీ భూములకు సర్వే నిర్వహించాలని ఆదేశించారన్నారు. అయితే అర్హులైన నిరుపేదలకు న్యాయం జరగడం లేదని, రెవెన్యూ సిబ్బంది కొంతమంది కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి జెడ్‌హెచ్‌డీసీ భూములను స్వాధీనం చేసుకొని పట్టాలు ఇచ్చిన రైతులకు హద్దులను గుర్తించి అందజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ మహిళా నాయకురాలు ఎం.సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



రాజంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

రాజంపేట టౌన్ : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ఫెయిల్ అయిన విద్యార్థులతో పాటు పలువురు ప్రథమ సంవత్సరంలో తక్కువ మార్కులు వచ్చిన వారు ఎక్కువ మార్కులు సాధించేందుకుగాను పరీక్షలు రాయనున్నారు. రాజంపేట నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉండగా నాలుగు మండలాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో రాజంపేటలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, నందలూరు, వీరబల్లి, సుండుపల్లె మండలాల్లో ఒకొక్క పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల విద్యార్థులకు కడప పట్టణంలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభమై 30వ తేదీ ముగుస్తాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. పరీక్షల నిర్వహణ కోసం ఆయా కేంద్రాల ప్రిన్సిపాల్స్, పరీక్షల నిర్వహణ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇదిలావుంటే రాజంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఫస్టియర్ విద్యార్థులు 235 మంది, సెకండ్ ఈయర్ విద్యార్థులు 82 మంది పరీక్షలు రాయనున్నారు. అలాగే కాకతీయ (షిర్డిసాయి) జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 155 మంది, ద్వితీయ సంవత్సరం 44 మంది, నలంద జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 240 మంది, ద్వితీయ సంవత్సరం 73 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. నందలూరు పరీక్షా కేంద్రంలో ప్రథమ సంవత్సరం 105 మంది, ద్వితీయ సంవత్సరం 33 మంది, వీరబల్లి పరీక్షా కేంద్రంలో ప్రథమ సంవత్సరం 63 మంది, ద్వితీయ సంవత్సరం 6 మంది, సుండుపల్లె పరీక్షా కేంద్రంలో ప్రథమ సంవత్సరం 187 మంది, ద్వితీయ సంవత్సరం 206 మంది పరీక్షలు రాయనున్నారు.

ప్రతి నిరుద్యోగికి ఉపాధి కల్పించడమే లక్ష్యం



ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తున్న కొరముట్ల, అజయ్‌రెడ్డిలు



లబ్ధిదారుకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు : నిరుద్యోగులు, విద్యార్థుల ఆసక్తికి, అభిరుచికి అనుగుణంగా ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలనే ధ్యేయంతో శిక్షణా తరగతులు, అవగాహన కార్యక్రమాలు, జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలరింగ్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ల విభాగంలో శిక్షణను పూర్తిచేసుకున్న అభ్యర్థులకు మంగళవారం రైల్వేకోడూరు పట్టణ డిగ్రీ కళాశాలలో కొరముట్ల శ్రీనివాసులు, ఏపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డిల చేతులమీదుగా ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు సరైన నైపుణ్యం అందించేందుకు జగనన్న ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఇందులో భాగంగానే మల్టీ నేషనల్ కంపెనీలతో ఒప్పందాల ద్వారా మంచి నైపుణ్యంలందేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. నిరుద్యోగుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ హబ్‌లలో వివిధ రంగాల నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహించి, శిక్షణ పూర్తయిన వెంటనే సర్టిఫికెట్‌తో పాటు ఉపాధి మార్గాలను చూపించే విధంగా ఈ కేంద్రాలు పనిచేస్తాయన్నారు. ఇప్పటికే రైల్వేకోడూరులో వేలాది మందికి జాబ్‌మేళా ద్వారా ప్రముఖ కంపెనీలలో ఉద్యోగ అవకావాలు పొందారని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జెట్పీటీసీ రత్నమ్మ, డీఎస్డీఓ హరిక్రిష్ణ, సర్పంచ్ చంద్రశేఖర్, అడ్వకేట్ ఆర్‌సి.సురేష్‌బాబు, ప్రిన్సిపాల్ శిరీషా, గంగయ్య, చలపతి, పార్థసారథి, గునిశెట్టి రమేష్, సూరి, బాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

చిట్వేలి : పేదల అభ్యున్నతి కోసం పోరాడుతూ సీఎం జగన్ పేదల పక్షపాతిగా నిలిచారని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం చిట్వేలి-1 సచివాలయం పరిధిలోని బ్రాహ్మణ వీధిలో ఉపసర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్ రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్తూ అందరినీ పలుకరిస్తూ సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే, నాయకులు స్థానిక ఆంజనేయస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్ర, ఎల్‌వీ మోహన్ రెడ్డి, రమణారెడ్డి, వెంకటరమణ, సుధాకర్ రాజు, బాలు, నరసింహులు, హజరత్ రెడ్డి, నవీన్, సుబ్రమణ్యం, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ మోహన్, పంచాయతీ విస్తరణ అధికారి రమణ, ఎస్ఐ సుభాష్ చంద్రబోస్, సచివాలయం సిబ్బంది, ఎంపీటీసీలు, వలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అన్ని సదుపాయాలతో ఎంఐజీ లేఅవుట్‌లు

రైల్వేకోడూరు : సొంత ఇల్లు అనేది ప్రతి ఒక్కరి కల, మధ్య తరగతి వారిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ పేరుతో అన్ని సౌకర్యాలు, అనుమతులతో కూడిన స్థలాన్ని తక్కువ ధరకే అందిస్తోందని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అనుడా) ఆధ్వర్యంలో నూతనంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో నిర్మించబోయే జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ కరపత్రాల విడుదల కార్యక్రమం నిర్వహించారు. కొరముట్ల మాట్లాడుతూ మధ్యతరగతి వర్గాలు, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. బాలిరెడ్డిపల్లె సమీపంలో కడప, రేణిగుంట మధ్య నూతనంగా నిర్మించబోయే గ్రీన్ హైవే పక్కనే 20 ఎకరాలలో 230 ప్లాట్లతో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు లబ్ధి చేకూరే విధంగా మొత్తం ప్లాట్లలో పదిశాతం రిజర్వు చేశామన్నారు. అలానే 20శాతం రాయితీని ఇస్తున్నారన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



విద్యార్థులకు పరుగు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



సిద్దవటం: డ్రాయింగ్ పోటీలను నిర్వహించిన దృశ్యం

సంబేపల్లె : గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని మండల కేంద్రంలోని గ్రంథాలయ నిర్వాహకుడు తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంబేపల్లె గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవి శిబిరాలలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జూన్ 11వ తేదీన బహుమతులు అందజేస్తున్నట్లు గ్రంథాలయం నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించామని గ్రంథాలయాధికారిణి లక్ష్మినారాయణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు పుస్తక పఠనం, వ్యాసరచన పోటీలు, ఆటల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తామని ఆమె తెలియజేశారు.

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న అంకన్న

లక్కిరెడ్డిపల్లె : మండలంలో ఆదివారం తీవ్రమైన గాలివానకు మామిడి కాయలు రాలిపోగా మామిడి రైతులు పూర్తిగా నష్టపోయారని, కావున ప్రభుత్వం ఆదుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకులు అంకన్న పేర్కొన్నారు. అనంతరం ఆయన నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తహసీల్దార్ ఉదయ్ శంకర్ రాజుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం అంకన్న మాట్లాడుతూ రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వారు కోరారు. మండలంలోని అన్ని పంచాయతీలలో బి.ఎర్రగుడి, మద్దిరేవుల, కస్తూరి రాజుగారిపల్లి, కుర్నూతల, దిన్నెపాడు ఇతర గ్రామాలలో తీవ్రమైన గాలివానకు అపారనష్టం వాటిల్లిందన్నారు. రైతులు సాగుచేసిన మామిడి పంట చేతికి అందే సమయంలో తీవ్ర నిరాశ మిగిల్చిందని చెప్పారు. ఎకరాకు రూ.50 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు స్వరూప, పీడీఎస్‌యూ నాయకులు తేజ, అనీల్, విజయలక్ష్మి, సుశీల, గౌతం తదితరులు పాల్గొన్నారు.

జూన్ 3న త్రేతేశ్వరుడి గిరి ప్రదక్షిణ

రాజంపేట రూరల్ : అత్తిరాలలోని త్రేతేశ్వరస్వామి గిరి ప్రదక్షిణను జూన్ 3వ తేదీ పౌర్ణమి సందర్భంగా నిర్వహిస్తున్నట్లు గిరి ప్రదక్షణ భక్త మండలి కోశాధికారి వై.నందకిషోర్ తెలియజేశారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సిద్ద లింగారెడ్డి, పి.ప్రభాకర్, సభ్యులు రాయుడు, సుబ్రమణ్యంనాయుడు, బాలకృష్ణారెడ్డి, నాగభుషణంరాజు తదితరులు సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ప్రారంభించిన ఈ గిరిప్రదక్షిణ ప్రతి పౌర్ణమికి నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. జూన్ 3న సాయంత్రం 6 గంటలకు గిరి ప్రదక్షిణ ఆలయం వద్ద నుంచి ప్రారంభమవుతుందన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేయనున్నట్లు తెలియజేశారు. గిరిప్రదక్షిణకు ఆలయ కమిటీ చైర్మన్ వి.వెంకటసుబ్బారెడ్డి ఎంతో సహకారం అందిస్తున్నట్లు తెలియజేశారు.

నేడు ఎమ్మెల్యే రాక

పెనగలూరు : మండలంలో నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు రానున్నట్లు వైస్ ఎంపీపీ విజయ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి ఎగువ సిద్దవరం, తిరుమలరాజుపేట గ్రామాలలో గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. ఎమ్మెల్యేతోపాటు రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అజయ్ రెడ్డి హాజరుకానున్నట్టు తెలియజేశారు. మండల నాయకులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


కళాశాలకు అధ్యాపకుల నియామకం

సిద్దవటం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు కొత్తగా అధ్యాపకులను నియమించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ సిద్దవటం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు ఈ ఏడాది నూతన అధ్యాపకులను నియమించిందన్నారు. ఇక్కడ విధులు నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన అధ్యాపకులు బి. రామలింగరాజు(కెమిస్ట్రీ), వై.రవి(ఫిజిక్స్), కె. భవాని (తెలుగు), శ్రీహరి (ఇంగ్లిష్), మరికొన్ని సబ్జెక్టులకు సంబంధించి అధ్యాపకులను కూడా ప్రభుత్వం త్వరలో నియమిస్తుందన్నారు.



నూతన అధ్యాపకులతో జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీరాములు


కృత్రిమ గర్భధారణ లక్ష్యాలను సాధించండి



నగదు ప్రోత్సహకాలను అందజేస్తున్న అధికారులు

రాజంపేట రూరల్ : కృత్రిమ గర్భధారణ నిపుణులకు ప్రభుత్వం నగదు ప్రోత్సహకాలను పంపిణీ చేస్తున్నట్లు డీఎల్‌డీఏ (జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ) చైర్మన్ ఆర్.మాదవరెడ్డి తెలియజేశారు. స్థానిక పశుసంవర్ధక శాఖ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం కృత్రిమ గర్భధారణ నిపుణులకు ప్రోత్సహకాలను కార్యనిర్వహణాధికారి డాక్టర్ జి.సురేష్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఆరీఫ్‌లతో కలిసి డీఎల్‌డీఏ చైర్మన్ మాదవరెడ్డి పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కృత్రిమ గర్భధారణ లక్ష్యాలను సాధించి జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలని కోరారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన 'పెయ్యదూడల ఉత్పత్తి పథకం'ను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెయ్యదూడలను వృద్ధి చేసుకుంటే పాల ఉత్పత్తి పెంపొందించుకోవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో పశువైద్యశాల సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్, పశువైద్యులు బి.శివరామిరెడ్డి, కె.భాగ్యవతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదు



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

చిట్వేలి : గ్రామాల్లోని ప్రజలు శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదని, సమన్వయంతో వ్యవహరించాలని డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ అన్నారు. రెండు రోజుల క్రితం పోలోపల్లిలో రామాలయంపై ఇరువర్గాల మధ్య జరిగిన వివాదం విషయమై స్థానిక ఎంపీపీ సభా భవనంలో డీఎస్పీ చైతన్యతో కలిసి గ్రామస్తులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలు వచ్చినప్పుడు పరస్పరం సహకారంతో శాంతియుతంగా పరిష్కరించుకొని జీవించాలన్నారు. గ్రామంలో ఇరువర్గాల వాదనలను నమోదు చేసుకున్నామని, ఆగమ పండితులతో చర్చిస్తామన్నారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు నివేదించి వారి ఆదేశాల మేరకు మరో సమావేశాన్ని నిర్వహించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో 144 సెక్షన్ అమలులో ఉందని, ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ విశ్వనాథరెడ్డి, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎస్ఐ సుభాష్ చంద్రబోస్, ఎస్‌బీఐ హెడ్ కానిస్టేబుల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు మూడు మండలాలలో విద్యుత్ అంతరాయం

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని 132 కె.వి. మరమ్మతుల కారణంగా నేడు (బుధవారం) మూడు మండలాలలో విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు ఒంటిమిట్ట విద్యుత్ శాఖ డీఈ మురళీధర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్టలోని 132 కె.వి. ఎస్ఎస్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఒంటిమిట్ట, నందలూరు, సిద్దవటం మండలాలలో ఉదయం 6 నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.